విలీన గ్రామాలతో ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విలీన గ్రామాలతో కలిపి కాకినాడ నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన లేఖను రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించకుంటే 2025 నుంచి 2027 మధ్య ఆర్థికసంఘం నిధులు మరో రూ.100 కోట్ల మేరకు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 14 ఏళ్లుగా ఎన్నికల నిర్వహించకపోవడం వల్ల తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట పంచాయతీలు రూ.140 కోట్ల నిధులను కోల్పోయాయని ఆ లేఖలో తెలిపారు. కావున త్వరితగతిన విలీన గ్రామాలతో కలిపి నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.

జిజిహెచ్‌కు అసౌకర్యం సుస్తీ

- సమస్యలతో ఎక్స్‌రే, స్కానింగ్ యూనిట్లు
- డిజిటల్ ఫిల్మ్‌ల కొరతతో తప్పని అవస్థలు
- వెంటాడుతున్న రేడియేషన్ భయం

8వ నెంబరు రూమ్‌లో మూలకు చేరిన ఎక్స్ రే పరికరాలు(ఇన్‌సెట్‌లో)6బిలో మరమ్మత్తులకు గురయిన కొత్త ఎక్స్ రే మిషన్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిజిహెచ్‌లో నెలకున్న అద్వాన్న పరిస్థితులు రోగులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వేలాదిమంది సామాన్య ప్రజానీకానికి సేవలందిస్తున్న ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సమస్యల వలయంలో చిక్కుకుంది. అసౌకర్యాల నిలయంగా మారింది. ప్రధాన విభాగాల్లో పరిస్థితులను చూస్తే రోగులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రోగి జబ్బుని నిర్ధారణ చేయడానికి, అనంతరం పూర్తి స్థాయిలో వైద్యం అందించేందుకు స్కానింగ్, ఎక్స్ రే ల పాత్ర చాలా కీలకమైనది. జిజిహెచ్‌లో రేడియాలజీ విభాగం ద్వారా నిత్యం వేలాదిమంది వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడ ఎదురవుతున్న పలు సమస్యల వలన రోగులతో పాటు, సిబ్బంది ఇబ్బందులకు పాలవుతున్నారు. ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్య వైఖరి ఈ దుస్థితికి కారణమంటూ పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాతోపాటు, ఉమ్మడి పశ్చిమ, అనకాపల్లి జిల్లాలకు చెందిన వేలాది మంది రోగుల ఆరోగ్య సమస్యలకు దిక్కయిన కాకినాడ జిజిహెచ్‌లో నెలకున్న అసౌకర్యాలు అనేక ఇబ్బందులను తెచ్చి పెడుతున్నాయి. ప్రధానంగా రేడియాలజీ విభాగంలో సిబ్బంది, ఫిల్మ్‌ల కొరతల వలన రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. జిజిహెచ్‌లో ప్రస్తుతం 7 అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరాలున్నాయి. వీటి ద్వారా నెలకు 15 వందల నుంచి 2 వేల వరకూ సాధారణ స్కానింగ్‌లు, మరో 2 వేల వరకూ గర్భిణులకు, సుమారు 500 వరకూ అత్యవసర స్కానింగ్‌లు జరుగుతున్నాయి. అయితే స్కానింగ్ చేస్తున్న గదుల పరిమాణం సరిపోక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఎన్ఐసియులో 1, పిఐసియులో 1, జిఐసియులో 1, ఆర్ఐసియులో 2, పమ్మనాలజీ విభాగంలో ఎఎంఐసియులో 1, మరో 7 పెద్ద ఎక్స్ రే పరికరాలున్నాయి. ఈ సెక్షన్‌లో రోజులో సుమారుగా 300 వరకూ ఎక్స్ రేలు తీస్తున్నారు. అత్యవసర విభాగంలో నెలకు 2 వేలు, సాదారణ వార్డులు, ఒపి విభాగాల్లో నెలకు సుమారు 7 వేలు ఎక్స్ రేలు జరుగుతున్నాయి.

అరకొర సిబ్బంది

ప్రస్తుతం ఈ విభాగాల్లో 8 మంది రెగ్యులర్, 8 మంది అవుట్ సోర్సింగ్, ఒకరు కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నారు. ఇక్కడ రోగుల సంఖ్యకు అనుగుణంగా మరో 30 మంది సిబ్బంది అవసరం ఉంటుంది. డిజిటల్ రేడియోగ్రాఫీ (డిఆర్) పరికరం ద్వారా పనిచేయడానికి ముగ్గురు సిబ్బంది అవసరం ఉంది. తమపై ఒత్తిడి పెరిగిపోతోందని, అదనపు సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బంది పలుమార్లు హెచ్ఒడి ద్వారా వినతులు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూలకు చేరిన పలు పరికరాలు

వివిధ విభాగాల్లో స్కానింగ్, ఎక్స్ రే పరికరాలు మూలకు చేరి ఉన్నాయి. రేడియాలజీ విభాగంలో సుమారు రూ.25 లక్షలపైనే నిధులతో ఏర్పాటు చేసిన ఎక్స్ రే మిషన్ మరమ్మతులకు గురై మూలన కూర్చుంది. 6బి వార్డులో ఒక మిషన్ మూలకు చేరింది. పదే పదే మరమ్మతులు చేయించినా పని చేయడం లేదని సిబ్బంది తెలిపారు. రూమ్ నెంబర్ 8లో మూడు మిషన్లు చాలా కాలం క్రితమే ఆగిపోయి మూలకు చేరాయి. వీటికి రిపేర్లు చేయించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో సిబ్బంది పార్టుబుల్ మిషన్‌తో ఎక్స్ రేలు తీస్తూ పని కానిస్తున్నారు. దీనివల్ల పని ఒత్తిడి పెరిగిపోతోందని పేరు చెప్పేందుకు ఇష్టం లేని కొందరు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మారో పక్క రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌తో పాటు, మాతా, శిశు విభాగంలోనూ కొన్ని స్కానింగ్, ఎక్స్ రే పరికరాలు తరచూ మొరాయిస్తున్నాయి. వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష ధోరణి కారణంగా రూ. లక్షల్లో సొమ్ములు వృధా అవుతున్నట్లు విమర్శలు లేకపోలేదు.

ఫిల్మ్‌ల కొరతతో ఇక్కట్లు

స్కానింగ్ చేసిన అనంతరం రోగులకిచ్చే డిజిటల్ ఫిల్మ్‌ల కొరత వలన పలు ఇబ్బందులు ఎదురవ్వుతున్నాయి. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. రోజులో సుమారు 300 వరకు ఫిల్మ్‌లు రోగులకు ఇవ్వాల్సి ఉండగా కొరత వలన ఇవ్వడం లేదు. ఫిల్మ్‌ల కొరత వలన సిబ్బంది ఆర్థోపెడిక్ వార్డులో ఉన్న కంప్యూటర్‌కి పంపుతున్నారు. రోగి రిపోర్ట్‌ను కంప్యూటర్‌లో వెతుక్కుని వైద్యం చేసేందుకు డాక్టర్లు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రమాదకరమైన 'రేడియేషన్' భయం

రేడియాలజీ విభాగంలో స్కానింగ్, ఎక్స్ రేలు తీసే సమయాల్లో వెలువడే ప్రమాదకరమైన 'రేడియేషన్' గురించి ఇటు రోగులు, అటు సిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విభాగంలో సరయిన సౌకర్యాలు లేకపోవడం వల్లనే ఈ పరిస్థితికి కారణమంటూ రోగులు ఆరోపిస్తున్నారు. సరిపడా భవనాలు, గదులు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. ఎక్స్ రే తీసే గదిలో వచ్చి వెళ్లే మార్గం ఒకటే ఉండాలి. లెడ్ ప్రొటక్షన్ కల్గిన ప్రత్యేక ఛాంబర్ కల్గి ఉండాలి. అన్ని వైద్య విభాగాలకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి. అయితే ఇటువంటి సౌకర్యాలు జిజిహెచ్‌లో సక్రమంగా లేవు. రేడియేషన్‌ను డిటక్ట్ చేసే బ్యాడ్జ్ కేవలం రెగ్యులర్ ఉద్యోగులకు మాత్రమే ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు లేకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎలు

6 లక్షల మంది మహిళలకు లబ్ధి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రారంభిస్తున్న దీపం-2 పథకంలో జిల్లాలో సుమారు 6 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో దీపం -2 పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి అమలు చేస్తున్న దీపం-2 పథకం కింద జిల్లాలో సుమారుగా 6 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. దీపం-2 పథకం ప్రతి మహిళ జీవితాల్లో గుర్తుండిపోయే మంచి సందర్భం అని అన్నారు. ఈ పథకం కోసం బియ్యం కార్డు, గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరిని లబ్ధిదారునిగా చేసిందన్నారు. లబ్ధిదారులెవ్వరు ఆందోళన చెందవలసిన పనిలేదని, అర్హులైన ప్రతిఒక్కరి ఆధార్ కార్డుకు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్‌కి సందేశం వస్తుందన్నారు. తమ సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్ 1967కి లేదా జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో ఉన్న 6.92 గ్యాస్ కనెక్షన్ల కు గాను ఇప్పటివరకు 5,11,756 మంది అర్హులను గుర్తించడం జరిగిందన్నారు. నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఇవ్వబడుతుందని, నేటి నుంచి ప్రారంభమైన ఈ పథకానికి సంబంధించి మొదటి సిలిండర్ కొరకు మార్చి 31, 2025 లోపు బుక్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్లు తుమ్మల పద్మజలక్ష్మి, కడలి ఈశ్వరీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎంవి.ప్రసాద్, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

8వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

ప్రజాశక్తి - కాకినాడ

బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళన 8వ రోజుకు చేరింది. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ 8 రోజులుగా క్లాప్ డ్రైవర్లు బకాయి జీతాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న అధికారుల్లో ఏమాత్రం స్పందన లేకపోవడం దారుణమన్నారు. దీపావళి రోజున సైతం ఆందోళన చేయాల్సిన దుస్థితి రావడం బాధాకరమని అన్నారు. వేతనాల చెల్లింపులను ఆలస్యం చేస్తే సోమవారం నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇస్మాయిల్, శివశంకర్, దుర్గాప్రసాద్, దుర్గబాబు, భైరవ స్వామి, రాజు పాల్గొన్నారు.

పెదలంక ఇసుక ర్యాంపును తెరవాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బోట్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - కాకినాడ

తమకు జీవనాధారమైన పెదలంక ఇసుక ర్యాంపును తెరిచిఉపాధి కల్పించాలని వెంకటేశ్వర బోట్స్‌మాన్ అసోసియేషన్ వర్కర్లు కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదలంక గ్రామ నాయకుడు మేడిశెట్టి చంటి, కార్మిక నాయకులు ఎం.రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు మాట్లా డారు. కాజులూరు మండలం పెదలంకలో అన్ని సామాజికవర్గాలకు చెందిన వారు ఉన్నారని, ఏడాది నుంచి పేరుకుపోయిన పెదలంక రేవులో ఇసుక మేటలను తొలగించుటకు అనుమతి ఇవ్వాలన్నారు. మాన్యువల్ పద్ధతిలో ఇసుకను తొలగించి బోట్ల ద్వారా ఒడ్డుకు తరలించాలని, వివిధ విభాగాల అధికారులు నిర్ణయించారని తెలిపారు. తొలగించిన ఇసుకను ప్రభుత్వ భూము ల్లో నిబంధనల ప్రకారం అధికారుల పర్యవేక్షణలో ఉంచుతామని చెప్పారు. ఉంచిన ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. బోట్లను అప్పులు చేసి కొనుగోలు చేసి పూట గడవక వడ్డీలు కట్టలేక పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అమరవిల్లి శ్రీను, గుత్తుల శ్రీను, మోర్త ప్రకాశం, బీర బ్రహ్మాజీ, మేడిశెట్టి హరీష్, జి.గిరీష్ శంకర్, వెంటపల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో వాలంటీర్ల ధర్నా

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. శుక్రవారం జిల్లాలోని పలు కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలను అందించారు.

పెద్దాపురంలో ధర్నా చేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు నాయకులు నందీశ్వరరావు, వాలంటీర్ల సంఘం నాయకుడు ఎ.ప్రకాష్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాలంటీర్లను కొనసాగిస్తామని, వేతనాన్ని రూ.10 వేలకు పెంపుదల చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవడంతోపాటు, వేతనాలను రూ.10 వేలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.అప్పారావు. వీరరాఘవ, మల్లిక, కుమారి, సత్య, రాజ్ కుమార్, వెంకటలక్ష్మి, ఉమాదేవి, రామలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు జాకాబ్, దొర, సతీష్‌కుమార్, భవాని, శ్రీదేవి, భవాని, అనిత, ప్రశాంతి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.శ్రీనివాస్, వాలంటీర్ల సంఘం నాయకులు కూనిరెడ్డి రవి మాట్లాడారు. ఎన్నికల ముందు వాలంటీర్లను రాజీనామా చేయొద్దని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదన్నారు. నవంబర్ 6న జరిగే క్యాబినెట్ మీటింగ్‌లోనైనా వాలంటీర్లను విధుల్లోకి తీసుకునేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.విజయ, టి.శ్రీజ, టి.కిరణ్మయి, డి.సుబ్బలక్ష్మి, శ్రీకాంత్, ఉల్లి బంగారయ్య, భాను, రవి పాల్గొన్నారు.

సర్వర్ల మొరాయింపు

సామర్లకోటలో ఎదురుచూస్తున్న పింఛన్‌దారులు

ప్రజాశక్తి - సామర్లకోట, ప్రత్తిపాడు

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీలో సర్వర్లు మొరాయించడంతో శుక్రవారం పింఛన్ దారులు పడిగాపులు పడ్డారు. ఉదయమే ఇంటికి సిబ్బంది వచ్చి పింఛన్లు అందించే పరిస్థితి ఉండగా ఈనెల పింఛనులను అందించకపోవడంతో సచివాలయాల వద్ద లబ్ధిదారులు ఉదయం నుంచి ఎదురు చూశారు. అయితే పింఛన్ల పంపిణీకి సంబంధించి చేపట్టే ఆధార్ ఎంపీ సర్వీస్ విధానం పని చేయకపోవడంతో పింఛన్ల పంపిణీకి ఇబ్బంది కలిగినట్టు అధికారులు తెలిపారు. సాధ్యమైన మేరకు సర్వర్ ఇబ్బంది పరిష్కారం అయితే సాయంత్రానికి లబ్ధిదారులందరకు పింఛన్లు అందించనున్నట్టు అధికారులు చెప్పారు. అయితే పింఛన్ల కోసం ఉదయం నుంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆయా సచివాలయాల వద్ద ఎదురు చూస్తూ గడపాల్సి వచ్చింది. అలాగే ప్రత్తిపాడు మండలం లంపకలోవ, ప్రత్తిపాడు, తదితర ఏజెన్సీ గ్రామాల్లో మధ్యాహ్నం రెండు గంటల వరకు 30 శాతం మాత్రమే పింఛన్లు పంపిణీ చేశారు. లంపకలోవ గ్రామంలో పింఛన్లు సర్వర్ పని చేయకపోవడంతో పింఛను దారులు పడిగాపులు పడ్డారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లిన సచివాలయం సిబ్బంది సైతం సర్వర్లు పని చేయకపోవడంతో ఇబ్బంది పడ్డారు. మండలంలో 23 గ్రామాల్లో 11,665 పింఛన్లకు 10,088 పింఛన్లు ఇచ్చినట్లు ఎంపిడిఒ కుమార్‌బాబు తెలిపారు.

వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

ప్రజావక్తి - తాళ్లరేవు

వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని పలువురు వాలంటీర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వాలంటీర్లు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం వాలంటీర్లను నియమించి రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చిందని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించామని తెలిపారు. ప్రభుత్వం మారిన తరువాత తమను పట్టించునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం వాలంటీర్లను కొనసాగించడంతోపాటు, రూ.10 వేలు వేతనాన్ని ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 4న తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వాలంటీర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వాలంటీర్లు కె.దుర్గాప్రసాద్, ఎ.సతీష్, గణేష్, సతీష్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలి

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలని రామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణ కార్మికులు తహశీల్దార్ కార్యాలయంతోపాటు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌కి వినతి పత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు అనిశెట్టి నూకరాజు మాట్లాడుతూ ఇసుక లేక పనులు లేకపోవడంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేతులూరి రత్నాజీ, ఉమ్మడి వీరబాబు, లవకుశ, కోలా వీరబాబు పాల్గొన్నారు.

సభ్యత్వం ద్వారా కార్యకర్తలకు భరోసా

సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లి దంపతులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సభ్యత్వం తీసుకునే వారికి టిడిపి అధినేత చంద్రబాబు భరోసా ఇస్తున్నారని రూరల్ నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని తూరంగి, కొవ్వూరు గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని అన్నారు. కావున ప్రజలు టిడిపి సభ్యత్వం తీసుకుని కుటుంబాలకు భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజా సంక్షేమానికి ప్రత్యేక కృషి



పెద్దాపురంలో చెక్కును అందచేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం, కాకినాడ రూరల్, గండేపల్లి

కూటమి ప్రభుత్వం అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం పెద్దాపురం రెవెన్యూ కార్యాలయం వద్ద దీపం -2 పథకం ప్రారంభ కార్యక్రమం జరిగింది. తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చి న వాగ్దానాలు నెరవేర్చేందుకు ఒక దాని తర్వాత ఒకటిగా పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్రీలలిత, కూటమి నాయకులు తుమ్మల బాబు, రాజా సూరిబాబురాజు, విత్తనాల వెంకటరమణ, భారత్ గ్యాస్ అధినేత మండవిల్లి శ్రీనివాస ముత్యాలు, హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తలాటం గంగాధర్ పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో దీపం-2 పథకాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రారంభించారు. తహశీల్దార్ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్‌ను ఎంఎల్ఎ నానాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సతీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు. గండేపల్లి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద దీపం పథకంలో గ్యాస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ నగదును చెల్లించకుండానే సిలండర్‌ను నేరుగా అందించాలని సీఎం చంద్రబాబును కోరతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, సర్పంచ్ కందుల చిట్టిబాబు, నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, వెలమాటి కాశి, జాస్తి వసంత్, అడబాల రామాంజనేయులు, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ దివ్యభారతి పాల్గొన్నారు.

జ్యోతులకు పలువురి అభినందన

ఎంఎల్ఎ జ్యోతులను సత్కరిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - జగ్గంపేట

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులుగా ఎంపికైన ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను పలువురు అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయానికి నాయకులు, అభిమానులు, అధికారులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జ్యోతులను కలిసిన వారిలో పోలవరం ఎస్ఇ సానా నాగేశ్వరరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, పిఠాపురం జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాసరావు, పలువురు కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.

ఆదిత్యలో ముగిసిన స్టూడెంట్ ప్రోగ్రాం

ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు సారథ్యంలో స్టూడెంట్ ఎనేబుల్మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. ప్రోగ్రాంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుకి విశేష సేవలు అందిస్తున్న పృథ్వీ ఆదిశేషు, ఐశ్వర్య రాజీవ్ ఆన్‌లైన్‌లో రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ప్రస్తుత సమాజంలో ఎఐ ఎంత ముఖ్యమో క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మూడో ఏడాది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడెమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డి.సంజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి.రాజేష్, కో-ఆర్డినేటర్ జి.లక్ష్మీకాంతి పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండపేట మండలం ఏడిద గ్రామంలో దళితులపై దాడి చేసిన పెత్తందారుల కఠినంగా శిక్షించాలని ఎస్‌సి, ఎస్‌టి, రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్న దళితులపై దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

రెండు గ్రూపుల ఘర్షణపై కేసు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఇరు వర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం రాత్రి 7 గంటలకు రాజపూడి గ్రామంలో రెండు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన సిహెచ్ అప్పల స్వామి ఇంటిముందు అదే గ్రామానికి చెందిన వేరే సామాజిక వర్గానికి చెందిన ఎస్ఎస్.కుమార్ అనే వ్యక్తి టపాసులు కాల్చుచుండగా చిన్న పిల్లలు ఇంట్లో ఉన్నారు, ఇంటిముందు టపాసులు కాల్చవద్దని చెప్పగా ఒకరితో ఒకరు వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల వారు చేరి గొడవలు పడి రాళ్ళు, కర్రలుతో దాడి చేయగా ఆరుగురికి రక్తపు గాయాలు అయ్యాయి. స్థానిక సిహెచ్‌సిలో చేర్చినట్లు తెలిపారు. ఇరువర్గాలు వారు మొత్తం 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కొమరగిరి పంచాయతీ పరిధిలోని పంట పొలాల్లో నాటు సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారాను కాస్తున్న వాసంశెట్టి వీరబాబును అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. బట్టీ వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, అలాగే నాటు సారా తయారీకి వినియోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వీర్రాజుపేటలో దీపావళి రోజున జరిగిన అగ్ని ప్రమాదంలో మాడా మల్లికార్జునరావుకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదం వార్త తెలిసిన వెంటనే స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదం వల్ల ఇంటి లోని అన్ని వస్తువులు దగ్ధం కావడంతో కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలారు. స్థానిక వ్యాపారపుంత వీధికి చెందిన టిడిపి నాయకులు ఉల్లి సత్యనారాయణ బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడులో 40 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పంట పొలాల్లో గుర్తుపట్టలేని విధంగా ఉన్న వ్యక్తి మృతదేహం ఉందని జేగురుపాడు ఇందిరానగర్‌కు చెందిన వరసాల రత్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుని ఒంటిపై స్కై బ్లూ రంగు మీద నలుపు నిలువు చారలు చొక్కా, నైక్ పేరుగల నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, నీలం రంగు ప్లాస్టిక్ చెప్పులు ధరించి ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

వృద్ధురాలి మెడలో బంగారం అపహరణ

ప్రజాశక్తి - కాత్రేనికోన

వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో బంగారాన్ని గుర్తతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన మండలపరిధిలోని పల్లంకుర్రు గ్రామంలో గత నెల 30న చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కశిరెడ్డి నాగమణి, ఆమె భర్త శ్రీరాములు పల్లంకుర్రులో నివాసం ఉంటున్నారు. గత నెల 30న రాత్రి సమయంలో టివి చూస్తున్న వృద్ధురాలిని వెనక నుంచి రుబ్బురోలు పొత్రంతో ఆమెను గుర్త తెలియని వ్యక్తి తలపై కొట్టాడు. దీంతో ఆమె కేకలు వేస్తూ నేలమీద పడిపోయి స్పృహ కోల్పోయింది. ఈ సమయం లో ఆమె మెడలో ఉన్న పది కాసుల బంగారపు వస్తువులను ఆ వ్యక్తి అపహరించాడు. కేకలు విన్న భర్త శ్రీరాములు పక్క గది నుంచి వచ్చేటప్పటికే చోరీకి పాల్పడిన వ్యక్తి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు పరిశీలించారు. దగ్గర్లోనే సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందుతుడిని తొందరలోనే పట్టుకుంటామని కాత్రేని కోన ఎస్ఐ అవినాష్ తెలిపారు. దీనిపై గత నెల 31న వృద్ధురాలి భర్త శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ముమ్మిడివరం ఎక్సైజ్ సిఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాలు ఇవి.. కొత్తపేట మండలం చిన్న గొల్లపాలెంకు చెందిన కేత శ్రీనివాసరావు శుక్రవారం యానాం నుంచి 6 బీరు సీసాలు, నాలుగు మద్యం సీసాలు తరలిస్తుండగా ఎదురులంక వారధి వద్ద అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుండి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అన్నంపల్లి లో మరో వ్యక్తి యానాం మద్యం తరలిస్తుండగా అతడి వద్ద నుండి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతడిని కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేట గ్రామంలో రెండు నెలలు నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గత నెల 31వ తేదీ రాత్రి ద్రాక్షారామ పోలీసులు దాడి చేశారు. రామచంద్రపురం సిఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అల్లం చంటి నిర్వహిస్తున్న సర్వీసింగ్ సెంటర్ వద్ద గల శిబిరంపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరు వద్ద నుంచి రూ.45,462 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

తనపై కులవివక్షతో గడ్డివాము దగ్ధం చేశారని గొల్లవిల్లికి చెందిన మధుర బాబులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొల్లవిల్లి సత్తెమ్మ గుడి సమీపంలో తాను వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నానని అన్నాడు. వ్యవసాయ భూమికి సమీపంలో గేదెలకు పాక గడ్డి వాము వేసుకున్నానని తెలిపాడు. దీనిని గ్రామానికి చెందిన గనిశెట్టి రాముడు వ్యతిరేకిస్తూ కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేశాడు.

టిడిపి, జనసేన మధ్య భగ్గుమన్న విభేదాలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖర్‌ను నిలదీస్తున్న జనసేన కార్యకర్తలు

డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్ఎ పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో టిడిపి, జనసేన మధ్య మరోసారి విబేధాలు భగ్గుమన్నాయి. శుక్రవారం స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో కూటమి పార్టీల నియోజవర్గ స్థాయి విస్తృత సమావేశం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎస్.వర్మ అధ్యక్షతన ప్రారంభం అయింది. ఈ సమావేశంలో కూటమి పార్టీల ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు వర్మ, మర్రెడ్డి శ్రీనివాస్, సూర్యనారాయణ రాజు మాట్లా డుతూ కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడే క్రమంలో మాజీ ఎంపిపి, జనసేన నాయకులు కురుమళ్ళ రాంబాబు లేచి 'మీరు కూటమి అభ్యర్థా? లేక ఒక పార్టీకి చెందిన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. కూటమి అభ్యర్థిగా పార్టీల కండు వాలను మీరు వేసుకుంటే సరిపోదని, మిగిలిన నాయకులు, కార్యకర్తలు వేసుకోవాలి. లేకపోతే అందరూ పార్టీ కండువాలు వేసుకోవడం మానేయాలి' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో టిడిపి, జనసేన కార్యకర్తలు ఒకరిపై ఒకరు కేకలు వేసుకోవడంతో ఒక్కసారిగా సమావేశం వేడెక్కింది. వారి మధ్య మాట మాట పెరిగి తోపు లాటకు దారి తీసింది. దీంతో అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ వేదిక దిగిపోయి వెళ్లిపోయారు. పొత్తు ధర్మాన్ని స్థానిక టిడిపి నాయకులు పాటించడం లేదని జనసేన నాయకులు విమర్శించారు. గతం నుంచి జనసేనలో ఉన్న నాయకులకూ, టిడిపికి ఎటు వంటి విభేదాలు లేవని, కొత్తగా జనసేనలో చేరిన వారి నుంచే ఇబ్బందులు తలెత్తుతున్నాయని మాజీ ఎంఎల్ఎ వర్మ ఆరోపించారు. ఇదే తీరు సాగితే కూటమి పార్టీల మధ్య విభేదాలు రాబోయే ఎంఎల్‌సి ఎన్నికలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ప్రకృతి పరిరక్షణ సంఘం, స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాలకు నిరక్షరాస్యులే కాకుండా విద్యావంతులు సైతం మోసపోతున్నారని అన్నారు. సైబర్ మోసగాళ్ళ కొత్త కొత్త రకాల సాంకేతిక పద్ధతులను వినియోగించుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయి మహిళలు, విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు రావడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని డిఎస్‌పి శ్రీహరిరాజు, సీఐ సూర్య అప్పారావు సూచించారు. అనంతరం స్పార్క్ ఫౌండేషన్ ఛైర్మన్ డి.సాయిసందీప్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సంరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు, డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, గోళ్ళ నాగేశ్వరరావు, తిరగటి వెంకటేశ్వరరావు, జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, కరోతు సత్యనారాయణ, వేల్పుపుల సూరిబాబు, రౌతు హదేవుడు, నారాయణరావు, సిరిపురపు రాజేష్, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్తీక ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

కార్తీక మాస ఉత్సవాలకు తగిన రీతిలో ఏర్పాట్లు చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప ఆదేశించారు. శుక్రవారం స్థానిక భీమేశ్వర ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఆలయ కార్య నిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటినుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస ఉత్సవాల్లో ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య భారీగా ఉంటున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. భక్తులకు అందించే ప్రసాదాల విషయంలో నాణ్యత పాటించాలన్నారు. పంచారామాల యాత్రా బస్సులకు సరిపడే విధంగా పార్కింగ్ ప్రదేశాన్ని సిద్ధం చేయాలన్నారు. ఆలయ పుష్కరిణిలో నింపుతున్న గోదావరి జలాలు కొంతమేర ఇంకా కలుషిత జలాలు వస్తున్నందున పరిశుభ్రమైన జలాలు నింపేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, తహశీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపిడిఒ హిమ మహేశ్వరీ, సిఐ కృష్ణ భగవాన్, జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షులు నూతల పాటి అప్పలకొండ, ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ కంటే జగదీశ్, కూటమి నాయకులు అడ బాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, సరోజ వాసు, మంచెం సాయి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భావ కవితా చక్రవర్తి దేవులపల్లి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, సామర్లకోట

సామర్లకోటలో దేవులపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

భావ కవితా చక్రవర్తి దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి అని, ఆయన సాహిత్యానికి చేసిన సేవ మరువలేనిదని సాహితీ ప్రియులు డాక్టర్ జవహర్ అన్నారు. శుక్రవారం బోటు క్లబ్ ఉద్యానవనంలో అరసం ఆధ్వర్యంలో దేవులపల్లి 127వ జయంతిని నిర్వహించారు. ప్రముఖ సాహిత్యవేత్త పి.పద్మజావాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జవహర్ మాట్లాడారు. సామర్లకోట మండలం చంద్ర పాలెం గ్రామంలో 1897 నవంబర్ 1న జన్మించిన దేవులపల్లి ఆకాశవాణిలో గేయాలు, బాల గేయాలు, కార్మిక గీతాలు, భక్తి గీతాలను అనేక సంఖ్యలో రచించి వినిపించారని అన్నారు. ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ సుకుమార సుందర సుమధుర లలిత మనోహర భావాలతో మూడు దశాబ్దాలపాటు సినీ సామ్రాజ్యాన్ని ఏలారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పి.సుబ్బరాజు, గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గౌరీ నాయుడు, అడబాల రత్న ప్రసాద్, అద్దేపల్లి ఉదయభాస్కర్, కొమ్మూరి శ్రీనివాసరావు, దాసరి శ్రీధర్, వెన్నపు ప్రసాద్‌పాల్, ఎం విజయలక్ష్మి, మంగతాయారు, ప్రసాద్ నాయుడు, రవి పాల్గొన్నారు. సామర్లకోట మండలం చంద్రపాలెం గ్రామంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి శీలామంతుల శ్రీనివాసరావు అధ్యక్షత కృష్ణశాస్త్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత దేవులపల్లి విగ్రహానికి పూలమాలలు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణశాస్త్రి హరిజనోద్ధరణకు చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీమల భవాని, ట్రస్ట్ గౌరవ సలహాదారులు దేగల బూరిబాబు, గ్రామ పెద్దలు తలాటం బాబులు, దమ్మాల బాబ్జి, గ్రామ కార్యదర్శి పేరాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట, గండేపల్లి

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిత్య ప్రతినిధులు

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘ భవనం వద్ద ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి, కన్యకా పరమేశ్వరమ్మ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అలాగే సామర్లకోట మఠం సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, రాజా సూరిబాబురాజు, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొర బాబు, బలుసు వాసు, పడాల వీర బాబు, విత్తనాల వెంకట రమణ పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండలంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగం నాలెడ్జ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రామాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, గ్రంథాలయ అధికారి కె.అశోక్‌కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్ పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితమైన ఉచిత ఇసుక

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ప్రకటనలకే పరిమితమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు గడిగట్ల సత్తిబాబు, సిఐటియు మండల ఉపాధ్యక్షులు నీలపాల సూరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల గడుస్తున్నా ఈనాటికి ప్రజలకు ఉచిత ఇసుక అమలు కావడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం ఇసుక అధిక ధరలకు అమ్ముతున్నారని, అధికార పార్టీ నేతల అండదండల వల్ల అధిక ధరలకు ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఇసుక ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగిస్తామని చెప్పటం వల్ల సమస్య మరింత జటిలమవుతాదని అన్నారు. ప్రభుత్వమే ఇసుక నిర్వహణ బాధ్యత చేపట్టి పగడ్బందీగా, అక్రమాలకు తావు లేకుండా ఉచిత ఇసుక అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోవిందలపూడి నాగపద్మనాభం, నీలపాల కృష్ణ, బొమ్మిశెట్టి శ్రీనివాస్, ముమ్మన శ్రీను, పత్తి నాగు, పెట్టెల రమణ, కడిపిన వీరబాబు పాల్గొన్నారు.

పొగతో ఉక్కిరి బిక్కిరి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రహదారి పక్కనే చెత్తను తగలబెట్టడంతో కమ్మేసిన పొగ

గొల్లప్రోలు నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్వాకంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను వేసేందుకు డంపింగ్ యార్డు లేకపోవడంతో సేకరిస్తున్న చెత్తను ఎస్‌సి కాలనీకి వెళ్లే మార్గంలోనూ, పోలీస్‌స్టేషన్, పిహెచ్‌సిల సమీపంలో వేస్తున్నారు. అక్కడే ఆ చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ నగర పంచాయతీవ్యాప్తంగా వ్యాపించి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తకు సిబ్బంది నిప్పు పెట్టారు. దీంతో నగర పంచాయతీని పొగ కమ్మేసింది. దీంతో ఆసుపత్రికి వెళ్లే రోగులతోపాటు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే అర్జీదారులు, ఎస్‌సి కాలనీకి వెళ్లే ప్రజలు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కులు మూసుకుని వెళ్తున్న కాలనీ మహిళలు

చిన్నారులు, వికలాంగుల మధ్య దీపావళి

ప్రజాశక్తి - కాకినాడ

వికలాంగులతో మాట్లాడుతున్న ఖుషి అగర్వాల్

దీపావళి పండుగను చిన్నారులు, వికలాంగుల మధ్య జరుపుకోవడం ఆనందాన్నిచ్చిందని ప్రముఖ వ్యాపారవేత్త వినోద్ అగర్వాల్ కుమార్తె ఖుషి అగర్వాల్ అన్నారు. దీపావళి పండుగను ఆమె కాకినాడలోని మహర్షి బులుసు సాంబమూర్తి కేంద్రం, సాంబమూర్తి నగర్‌లో ప్రభుత్వ అంధుల ఆశ్రమం, 50 బిల్డింగ్ సెంటర్లో గల వీధి బాలలు ఉండే పరివర్తన బాలల సంరక్షణ కేంద్రం, ఉమా మనోవికాసలోని పిల్లలకు స్వీట్లు, దీపావళి సామాన్లు పంపిణీ చేశారు. స్వీట్లు, దీపావళి సామాన్లు అందుకున్న చిన్నారులు, వికలాంగులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారికి భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఖుషి అగర్వాల్ మాట్లా డుతూ చిన్నారుల మధ్య దీపావళి జరుపుకోవడం తనలో సేవాభావాన్ని మరింత పెంచిందన్నారు. తన తండ్రి వినోద్ అగర్వాల్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలులో నిత్యం పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వెంకట శివరామకృష్ణ, సరళ ఫుడ్స్ ఉద్యోగులు రావు పాల్గొన్నారు.

రూ.10 నాణెం చెల్లుబాటు

ప్రజాశక్తి - కరప

బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రూ.10 నాణెంలు చెల్లుబాటు అవుతాయని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ బి.తేజ తెలిపారు. శుక్రవారం బ్యాంకు బయట రూ.10 నాణెం చెలామణిలో ఉందని, బ్యాంకులో ఆ నాణెంను తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు విరివిగా నాణెంను వినియోగించుకోవాలని బ్యానర్‌ను ప్రదర్శించారు. ఇటీవల రూ.10 నాణెం చెల్లుబాటు కావటం లేదనే పుకారులతో మారకాలు నిలిచిపోయాయి. తెలిసినవారు, తెలియని వారు కూడా మొండిగా రూ.10 నాణెంను వినియోగించడం లేదు. ఈ నేపథ్యంలో రూ.10 నాణెంకు చట్టబద్ధత ఉందని, ప్రజలు వీటిని రోజువారి లావాదేవీలులోని వినియోగించవచ్చునని బ్యాంకు అధికారులు బ్యానర్‌ను ప్రదర్శించడంతో ప్రజలు అపోహల నుంచి బయటపడే అవకాశం ఉంది.

కరపలో 92 శాతం పించన్ల పంపిణీ పూర్తి

ప్రజాశక్తి - కరప

కరప మండలంలోని 23 గ్రామాల్లోని సుమారు 92 శాతం పించన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ అనుపమ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పంపిణీలో భాగస్వాములు అయ్యారు. పింఛన్ పంపిణీలో భాగంగా మండలంలో పెనుగుదురు, కరప, కూరాడ, వేలంగి గ్రామాల్లో పర్యటించినట్లు ఆమె తెలిపారు. ఉదయం 8.30 వరకూ 39 శాతం పంపిణీ పూర్తి కాగా, సర్వర్ నిలిచి పోవడంతో పంపిణీ ఆగింది. తిరిగి సర్వర్ సమస్య పరిష్కారం అయిన వెంటనే పంపిణీ చేసినట్లు ఆమె తెలి పారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు .

టిల్లపూడి పుట్టినరోజు వేడుకల్లో అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

భోజనాలు వడ్డిస్తున్న టిల్లపూడి

మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు, సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను పంచా యతీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు నాగేశ్వరరావును దుస్సాలువ పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం సుంకరపాలెం ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిల్లపూడి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు అనంతలక్ష్మి, వీరబాబు, ప్రమీల, శ్రీనివాస్, సుగుణవతి, స్థానిక ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వల్లీబాబు జయంతిలో పలు సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లైన్స్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు వత్సవాయి వల్లీబాబు జయంతి సందర్భంగా తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్ కుమార్ నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వల్లీబాబు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారంతో రూ.16 వేలు విలువ చేసే ట్యాబ్ ఉత్తమ ప్రతిభ చాటుకున్న ప్రతిభా విద్యార్థికి అందజేశారు. చొల్లంగి గురుకుల పాఠశాలలో 12 సీలింగ్ ఫ్యాన్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో చిట్నీడి శ్రీనివాస్, వేలూరి సూర్యనారాయణ, లక్ష్మీపతిరాజు, బి.శ్రీనివాసరెడ్డి, వినోద్, దత్తు, ధూళిపూడి బాబి, రాయపరాజు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల గ్రామానికి చెందిన అడ్డ కొండ సీలింగ్ భూములను 45 ఏళ్లుగా పోరాడుతున్న కె.గోపాలపురం, మల్లిసాల గ్రామాల ప్రజలకు కేటాయించి, పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం మల్లిసాల గ్రామానికి చెందిన అడ్డుకొండ సీలింగ్ భూముల్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అడ్డ కొండ సీలింగ్ భూములపై ఏలేటి ఫ్యామిలీకి వ్యతిరేకంగా సిసిఎల్ఎ కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో గత 45 ఏళ్లుగా ఆ భూములలో అనేక నిర్బంధాలను, కేసులను ఎదుర్కొని, పేదలు పోరాడుతున్నారన్నారు. అప్పటి నుంచి డబ్బులు ఖర్చు పెట్టి, తమ శ్రమను వెచ్చించి ఆ భూములను సాగు చేసి, తోటలు పెంచి నష్టపోయారన్నారు. ఆ భూములను స్థానిక ఎంఎల్ఎ పరిశ్రమలకు కేటాయిస్తామనడం అన్యాయమని అన్నారు. 45 ఏళ్లుగా పోరాడుతున్న ప్రజలకే ఆ భూములను కేటాయించి పట్టాలవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, కడితే సతీష్, డి.సురేష్, ఆకుమర్తి పెద్ద, లక్ష్మి, వేమగిరి వెంకటేశులు, కోడి నాగభూషణం, కోడి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్నా ఈనాటికీ పథకాలు అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తద్వారా గతంలో పెండింగ్‌లో ఉన్న క్లైములకు చెల్లించాల్సిన సొమ్మును చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బత్తుల మురళి, కోన శ్రీను, శేషు, కాశీ, సిరికి రాంబాబు, రామకృష్ణ, కృష్ణ, సత్తిబాబు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that the statement of Marks and Pass certificate of ICSE Improvement Examination 2023 belonging to Gollapalli Srivalli Durga Jyothi (Unique ID : 7831717, Index Number : 1233181 / 030) who studied in St. Joseph's Convent School, Kakinada were received from the Council for the Indian School Certificate Examinations, New Delhi on 17-07-2024. Subsequently the said documents were misplaced in the St. Joseph's convent school, Jagannaickpur, Kakinada and till today they were not traced despite thorough search efforts made by the school, for which a complaint also has been lodged before I Town Police Station, Kakinada. Any person finding these above mentioned documents or having any information about them is requested to handover to the Head Mistress St. Joseph's Convent School, Church Square, Jagannaickpur, Kakinada or to the given address below mentioned.

Kakinada 30-10-2024 — **Karra Venu**, Advocate. D.No.6-3-30, Dantuvari Street, Kakinada. Ph: 98495 48272